క్లుప్తంగా

పంటకాలువ పూడిక తీత



మండవల్లి: ఉపాధి హామీ పథకం పనులతో కూలీలకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఎంపీడీఏ ఎస్.నవీన్ తెలిపారు. మండలంలోని మూడుతాళ్లపాడులో శనివారం 67 మంది కూలీలు పంట కాలువ అభివృద్ధి పనులు చేశారు. కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందని, తద్వారా రైతులకు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఏర్పడుతుందని ఎంటీఏ తెలిపారు. ప్రజలకు, పశువులకు సైతం తాగునీటి సమస్య తొలగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో 5,085 మంది కూలీలు

పమిడిముక్కల: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జరిగిన 125 పనుల్లో 5,085 మంది కూలీలు పాల్గొన్నట్లు ఈసీ కిరణ్ తెలిపారు. పంట కాలువల పూడికతీత, చెరువు తవ్వకం పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



కురుమద్దాలి(పామర్రు): గ్రామానికి చెందిన ఎన్‌బీ పూర్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఫండ్ సౌజన్యంతో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి శనివారం నగదు బహుమతిని అందజేశారు. ఫండ్ అధినేత ఆముదాలపల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతిలో 574 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇంటూరి లీలా తన్మయ్‌ను అభినందిస్తూ రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. సభ్యులు, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

తోట్లవల్లూరు: వాహనం ఢీకొని యువకుడు గాయపడిన ఘటన మండలంలోని రొయ్యూరు వద్ద జరిగింది. మండలంలోని వల్లూరుపాలెం గ్రామానికి చెందిన వాకా గోపి (29) కృష్ణా కరకట్ట మీదుగా శుక్రవారం రాత్రి బైక్‌పై మద్దూరు వెళుతున్నాడు. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళుతున్న బొలెరో వాహనం రొయ్యూరు వద్ద ఆయనను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు, పక్కటెముకలకు గాయాలయ్యాయి. గాయపడిన గోపిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం



పమిడిముక్కల: మంటాడ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులు గోవిందనామాలు, లలితాపారాయణం, భజనలు చేశారు. భక్తులకు దాతల సహకారంతో అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈవో మాధవీలత, సిబ్బంది సాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశువుల మేత కొరత తీరుతోందిలా..!

- టీఎంఆర్ పేరుతో 128 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా
- పశు పోషకులకు ప్రభుత్వం చేయూత



పశు పోషకులకు దాణా అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, పశు సంవర్ధకశాఖ అధికారులు (ఫైల్)

గుడివాడరూరల్: వేసవిలో పశువులకు ఏర్పడే మేత కొరతకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే టీఎంఆర్ (టోటల్ మిక్స్‌డ్ రేషన్) పథకంతో పశువులకు మేత కొరత లేకుండా దాణాను పంపిణీ చేస్తోంది. ఈ పథకం వలన పశువులకు మేత కొరత తీరడమే కాకుండా పశు పోషకులకు ఆదాయ వనరులు సమకూరనున్నాయి. సాధారణంగా వేసవిలో ఎండల వలన పశువులకు మేత ఇబ్బంది ఏర్పడుతుంది. మేత ఎండిపోవడంతో పశువులకు కొరత ఏర్పడుతోంది. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం సమీకృత దాణాను సబ్సిడీపై టీఎంఆర్ పథకం ద్వారా పశు పోషకులకు దాణాను పంపిణీ చేస్తోంది. ఈ దాణా వలన అధిక పాల దిగుబడి వస్తుంది. పశు పోషకులు రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాల్లో రైతుల ఆధార్ నంబర్ నమోదు చేసి నేరుగా అక్కడే నగదు చెల్లించి దాణాను బుక్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ఆర్బీకేల ద్వారా..

గుడివాడ నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలతో పాటు అర్బన్‌లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 318 మంది పశు పోషకులకు 128 మెట్రిక్ టన్నులు టీఎంఆర్ దాణాను 41 ఆర్బీకేల ద్వారా సరఫరా చేశారు. మొత్తం గేదెలు 30,000, ఆవులు 3330 ఉన్నాయి. సాధారణంగా 5 లీటర్ల పాలు ఇచ్చే పశువుకు రోజుకు పచ్చి మేత 30 నుంచి 40 కేజీలు, ఎండు గడ్డి 10 నుంచి 15 కేజీలు, దాణా 5 నుంచి 10 కేజీలు అవసరం అవుతుంది. టీఎంఆర్‌లో జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కొర్రలు, నూనె తీసిన సోయాచెక్క, వేరుశెనగ చెక్క, పత్తిచెక్క, వరి, గోధుమలు, తవుడు, కంది, మినుము, పెసరపొట్టు ఇలా సమీకృత ఆహారం మిళితమై ఉంటుంది.

మేతకు ఇబ్బంది లేకుండా..

వేసవిలో పచ్చి గడ్డి దొరకదు. యంత్రాలతో కోసిన ఎండుగడ్డిని తినడానికి పశువులు ఇష్టపడవు. దీంతో పశుపోషకులు టీఎంఆర్ దాణాను వినియోగించాల్సి వస్తోంది. టీఎంఆర్ దాణాను బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే జీఎస్టీతో కలిపి కేజీ రూ.16 అవుతుంది. ప్రభుత్వం ఈ దాణాను 60 శాతం సబ్సిడీతో కేజీ రూ.6.50 వంతున అందజేస్తోంది. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పాల దిగుబడిని సాధిస్తున్నారు. ఈ రుచికరమైన మేత ఉండటంతో పశువులు ఎక్కువగా తింటున్నాయి. చేపల చెరువులు అధికంగా ఉన్న గ్రామాల్లో వరి పొలాలు తక్కువ. దీని వలన పశువులకు మేత దొరకడం కష్టంగా మారింది. ఈ ప్రాంతాల్లో టీఎంఆర్ దాణాను అధిక శాతం పశు పోషకులు వినియోగిస్తూ అధిక పాల దిగుబడులను సాధిస్తూ ఆర్థికపరమైన స్వావలంభన పొందుతున్నారు.

గుడివాడ నియోజకవర్గంలో ..

మండలం	సబ్సిడీ వినియోగించుకున్న రైతులు	కొనుగోలు చేసిన దాణా (టన్నుల్లో)
గుడివాడ	90 మంది	44 మెట్రిక్ టన్నులు
గుడ్లవల్లేరు	130 మంది	64 మెట్రిక్ టన్నులు
నందివాడ	98 మంది	20 మెట్రిక్ టన్నులు
మొత్తం	318	128 మెట్రిక్ టన్నులు

60 శాతం సబ్సిడీతో సరఫరా..

టీఎంఆర్ దాణాను ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో కేజీ రూ.6,50 వంతున అందిస్తోంది. ఈ దాణాలో అన్ని రకాల పోషణ ఇచ్చే సమీకృతాలు మిళితం కావడంతో పశువులు ఇష్టంగా తింటున్నాయి. ఈ దాణా తినడం వలన పశువులకు జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఆరోగ్యం, ఎదుగుదలతో పాటు పాల ఉత్పత్తి పెరగడంతో పశు పోషకులకు మేలు జరుగుతుంది. అధిక పాల దిగుబడి ద్వారా పశు పోషకులకు ఆర్థికపరమైన స్వావలంభన కలుగుతుంది. ఈ పథకాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

–వేణు, మండల పశు సంవర్ధకశాఖ అధికారి, గుడివాడ

పశు పోషకులకు మేలు..



టీఎంఆర్ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే దాణా వలన పశు పోషకులకు మేలు జరుగుతుంది. సమీకృత ఆహారం పశువులకు ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉంటున్నాయి. అధిక పాల దిగుబడి ఇస్తున్నాయి. దీని వలన పశు పోషణ ఖర్చులు తగ్గడమే కాకుండా పాల దిగుబడి ఆదాయం పెరిగింది. ప్రభుత్వం పశు పోషకులకు మేలు చేస్తోంది. ఈ పథకాన్ని కొనసాగించాలి.

–విఘ్నేష్, పశు పోషకుడు, చినఎరుకపాడు

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి



రొయ్యూరులో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ కిశోర్‌బాబు

తోట్లవల్లూరు: రొయ్యూరులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పమిడిముక్కల సీఐ ఎం.కిశోర్‌బాబు ఆధ్వర్యాన శనివారం ఉదయాన్నే ప్రత్యేక పోలీసు బృందాలు గ్రామంలో తనిఖీలు నిర్వహించాయి. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా అనుమానిత ప్రదేశాలు, వ్యక్తులను పోలీసులు తనిఖీలు చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎలాంటి అల్లర్లు, హింసాయుత ఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ కిశోర్‌బాబు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఆయన గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలన్నారు. అక్రమంగా పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, బాణసంచా అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ ఇంజిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కిషోర్‌బాబు తెలిపారు. తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి ఎస్‌ఐలు విశ్వనాథ్, శ్రీనివాస్, రాజు, పమిడిముక్కల సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

నందివాడ: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు హెచ్చరించారు. మండలంలోని పోలుకొండ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, కౌంటింగ్ జరిగే సమయంలో ఎటువంటి గొడవలు తలెత్తకుండా ముందస్తుగానే జిల్లా ఎస్పీ, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో గుడివాడ తాలూకా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, దీంతో పాటు 144 సెక్షన్ కూడా అమలులో ఉందని చెప్పారు. శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా, కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినా పోలీసులకు సమాచారం అందించాన్నారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలులేని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నందివాడ, గుడివాడ తాలూకా ఎస్‌ఐలు చంటిబాబు, ఎల్ఎస్ఎన్ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపునకు సర్వే



మాట్లాడుతున్న ఏడుకొండలు

గుడ్లవల్లేరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమీపంలోని పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త కె.ఏడుకొండలు తల్లిదండ్రులకు సూచించారు. 0–18 సంవత్సరాల దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు, నమోదు సర్వే కార్యక్రమాన్ని శనివారం గుడ్లవల్లేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అవసరాల పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లలతో కలిపి కూర్చోబెట్టడం ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో మేధోశక్తి, వికాసం పెరుగుతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులందరూ పిల్లలను పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫిజియోథెరపీ కేంద్రాలకు తీసుకెళ్లాలని, వారికి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సర్వే, నమోదు వచ్చే నెల 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు వి.విజయకుమారి, అబ్దుల్ హమీద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



తోట్లవల్లూరులో అన్నసమారాధనలో భక్తులు

తోట్లవల్లూరు: స్థానిక రుక్మిణీ సత్యభామాసమేత శ్రీవేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ నెల 17న ప్రారంభమైన స్వామి వారి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు వేడుకగా సాగాయి. ఉత్సవాల చివరి రోజైన శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది గ్రామస్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. రాత్రికి పవళింపు సేవతో కార్యక్రమాలు ముగిశాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకుడు పీతాంబరం విజయకుమార్ ఆచార్యులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



ప్రసంగిస్తున్న రత్నం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ

గుడ్లవల్లేరు: సమాజంలో విద్య ద్వారానే గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని రత్నం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ మొవ్వా రామకృష్ణ పేర్కొన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏపీ ఉత్తర్వుల ప్రకారం 2023–24 విద్యా సంవత్సరాల్లో ప్రాంగణ ఎంపిక ద్వారా ఉద్యోగాలు పొందిన విద్యార్థులను గుర్తిస్తూ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ ఎచీవర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలను ముఖ్య అతిథి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా డిప్లమో విద్యార్థిననీ, సాధారణ రైతు కుటుంబం నుంచి ఈస్థాయికి వచ్చానని, కేవలం రూ.350 వోచర్ పేమెంట్‌తో జీవితం స్టార్ట్ చేసి ప్రస్తుతం మంచి టర్నోవర్‌ను తన కంపెనీలు సాధిస్తున్నాయన్నారు. మన చుట్టుపక్కల ఉన్న సమస్యలను అవగాహనతో అర్థం చేసుకుని మనం నేర్చుకున్న విద్యతో వాటిని అధిగమించడానికి చేసే ప్రయత్నాలే మనల్ని ఉన్నత స్థానాలకు చేర్చుతాయన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, ఆయా శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

మండవల్లి: మండలంలోని లోకుమూడిలో ఇంటి సంజీవరావు (40)కు చెందిన పెంకుటిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యింది. మంచం, బీరువా, టీవీ, రెండు కాసుల బంగారం, దుస్తులు కాలిపోయాయి. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని భావిస్తున్నారు. వీఆర్వో ఆంజనేయులు ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



జమీగొల్వేపల్లిలో చెస్ ఆడుతున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులకు ఆటల వలన శారీరక వ్యాయామంతో పాటుగా మానసిక వికాసం కలుగుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. క్యారమ్స్, చెస్, తాడులాగుట, బిజినెస్ వంటి ఆటలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీవి వంశీకృష్ణ, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. పామర్రులో ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు షటిల్ పోటీలు నిర్వహించారు. నీతి కథలు చదివించామని గ్రంథాలయ అధికారిణి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

మొవ్వ: గ్రంథాలయాలు విద్యా బాండాగారాలని, గ్రంథాలయాలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులు తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి టి.కృష్ణకుమారి పేర్కొన్నారు. గత కొద్ది కాలంగా మొవ్వ గ్రామంలోని తృతీయ శ్రేణి గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు, నీతి కథలు, చిత్రలేఖనం లాంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నామని కృష్ణకుమారి తెలిపారు. చదువుతో పాటు పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో శనివారం నీతి కథలను చదివించారు. అనంతరం వాటి సారాంశాన్ని గ్రంథాలయాధికారి షేక్ పర్వీన వివరించారు. జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు పోటీ నిర్వహించారు. ఈ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జి, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి అంశాలు నేర్పిస్తున్నట్లు షేక్ పర్వీన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలిదిండి: మనిషి జీవితంలో అభ్యాసం నిరంతర ప్రక్రియ అని గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు విద్యార్థులకు సూచించారు. నిరంతరం పుస్తక పఠనం చేయాలని వారికి చెప్పారు. కలిదిండిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. శనివారం శిబిరానికి హాజరైన విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాధాన్యత వివరించి, వారితో పుస్తక పఠనం చేయించారు.

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు



పామర్రు: హనుమజ్జయంతి జూన్ ఒకటిన శనివారం సందర్భంగా మండల పరిధిలోని పలు ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. జయంతి రోజున తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారిణి ఎల్.సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎండోమెంట్ అధికారులు పాల్గొంటారని, ఆలయంలో పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభిస్తారని తెలిపారు. రాత్రి 7 గంటలకు శ్రీవీరాంజనేయస్వామి, సువర్చలా దేవిల శాంతి కల్యాణం, అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. పామర్రులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి కార్యక్రమం జరుగుతుందని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. జమీదగ్గుమిల్లి, రాపర్ల తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు హుండీల కానుకల లెక్కింపు నిర్వహిస్తామని ఆలయ ఈవో మాధవీలత శనివారం తెలిపారు. దేవదాయ ధర్మాదయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తామని, ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని తెలియజేశారు.

పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి సారవంతం

పామర్రు: రబీ సాగు అనంతరం పొలాల్లో పచ్చిరొట్టపైరులను పెంచడం వలన భూసారాన్ని పెంచుకుని తద్వారా రసాయని ఎరువులను తగ్గించుకోవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత వెల్లడించారు. శనివారం ఆమె మాట్లాడుతూ విచక్షణ రహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఆడవి నీలిలను పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలన్నారు. పూత దశ వరకూ పెంచి భూమిలో కలియదున్నాలని చెప్పారు. పచ్చి రొట్ట పైర్లలో స్థూల పోషకాలైన నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం వరకు పొటాషియం 0.5 శాతం నుంచి 2.0 శాతం వరకు ఉంటాయి. వీటితో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. పంట ఎదుగుదల, దిగుబడికి ఈ మూడు పోషకాలు ఉండటం వల్ల రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. 30 శాతం వరకూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువులు వేయడం ఎంతో మేలని సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమి లోపల పొరలలో నిక్షిప్తమైన పోషకాలను వెలికి తెచ్చి లభ్య రూపంలో పంట మొక్కలకు అందిస్తాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. కలుపు మొక్కలు నాశనమవుతాయి. అందువల్ల రైతులందరూ పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం మంచిదని ఏడీఏ స్వర్ణలత సూచిస్తున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో పలు అంశాలపై తొలుత అవగాహన కల్పించి అందుకు సంబంధించిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు పాండురంగారావు ఈ పోటీలకు ముందు ఇంగ్లిషు సబ్జెక్టుకు సంబంధించి గ్రామర్ బోధించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

నీటి పథకం మోటారు చోరీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు పంచాయతీ మంచినీటి పథకానికి సంబంధించిన మోటారు చోరీకి గురైంది. స్థానిక పోలీసుస్టేషన్‌లో కార్యదర్శి జి.రమేష్ శనివారం ఫిర్యాదు చేశారు. మంచినీటి పథకానికి సంబంధించిన 3 హెచ్‌పీ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. శనివారం ఉదయం పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు మోటార్ వేయడానికి ట్యాంక్ వాచర్ బాలస్వామి వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించి కార్యదర్శి రమేష్‌కు సమాచారమందించారు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యాన మచిలీపట్నంలో నిర్వహిస్తున్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విజయవాడ రేంజ్ డీఐఎస్ మహమ్మద్ సాదతుల్లా తెలిపారు. ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఆసక్తి కలిగిన విద్యార్థులకు గురుకుల పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే విద్యార్థి రికార్డు షీటు, బదిలీ సర్టిఫికెట్, రూ.లక్షలోపు ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చని ఆయన వెల్లడించారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతికి 59 సీట్లు, 7వ తరగతికి 55 సీట్లు, 8వ తరగతికి 54 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన విద్యార్థులు మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అర్హులని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31లోపు మచిలీపట్నం చిలకలపూడిలోని వరలక్ష్మి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో తమ దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో పూర్ణాహుతి

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు గుండెపూడి నాగరాజశేఖర్ శర్మ బ్రహ్మత్వంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం 8 గంటలకు స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, నిత్యహోమాలు, శ్రీ ఫలహోమం, చండీహోమం, రుద్రహోమంతో, పూర్ణాహుతి నిర్వహించారు.